# బానిస

నగేష్ వయస్సు ఇరవై నాలుగు బేంక్‌లో ఆఫీసర్. మెటిల్డాతో ప్రేమలో పడ్డాడు. మెటిల్డా అతను పనిచేసే డివిజనల్ ఆఫీస్‌లో క్లర్క్.

ప్రేమలో పడ్డవాళ్ళు చాలామంది చేసే పనులన్నీ చేసారు ఇద్దరూ. ఏ.సి. హోటల్ కెళ్ళి కాఫీతాగి రెండు గంటలు కూర్చుని మాట్లాడు కోవటం, సినిమాకివెళ్ళడం, టేంక్‌బండ్‌కి, జూపార్క్‌కి నగేష్ స్కూటర్‌మీద ఉస్మాన్‌సాగర్‌లోని పార్క్‌కి, తిరిగి వస్తూ గోల్కొండ కోటకి వెళ్ళటం, తన స్నేహితుడింటికి టీకి వెళ్ళటం....

సంగతులన్నీ ప్రేమలో పడ్డంత తేలికగా నగేష్ తండ్రికి, మెటిల్డా తల్లి కి తెలిసాయి.

ప్రేమలో పడ్డ జంట తల్లిదండ్రులు చాలామంది చేసే పనులన్నీ చేసారు ఇద్దరూ ఆ సంబంధం తమ కిష్టంలేదని స్పష్టం చేసారు. చేసుకుంటే ఇక ఆ యింటి గడప తొక్కకూడదని వాదించారు చచ్చిపోతామన్నారు. నెల్లాళ్ళకి పెళ్ళిళ్ళు కావన్నారు కులాంతరమేగాక. మతాంతర వివాహం అసలు భరించలేమన్నారు ఇవన్నారు అదన్నారు ఏమన్నా నవ ప్రేమికులిద్దరూ చలించలేదు.

"అదివాడికేదో మందుపెట్టింది" నగేష్ తల్లి కళ్ళు వత్తుకుంది. రిజిష్టర్ మేరేజ్ చేసుకోబోతున్నారని తెలిసి.

"వాడు దీనికేదో మంత్రం వేశాడు" మెటిల్డాతల్లికూడా కళ్ళు వత్తుకుంది. మర్నాడు రిజిష్టర్ మేరేజ్ అనగా నగేష్ తండ్రి కొడుకుని మరోసారి ఆ ప్రయత్నం విరమించుకోమని అర్థించాడు.

"నో ఫాదర్" చెప్పాడు నగేష్.

కూతుర్ని తల్లి ఆఖరి సారి కోరింది ఆ వివాహం రద్దు చేసుకోమని.

"నో మదర్" చెప్పిందిమెటిల్డా.

"నువ్వు దానికి బానిసయ్యావు" అరిచాడు నగేష్ తండ్రి.

"మా మధ్య వున్నది ప్రేమ. బానిసత్వం కాదు" చెప్పాడు నగేష్.

ఇద్దరికీ రిజిస్ట్రార్ ఆఫ్ మేరేజెస్ ఆఫీసులో వివాహం అయింది ముందరే తీసుకున్న ఇంట్లో వేరు కాపురం పెట్టారు.

మొదటి రాత్రి....

నగేష్ గోల్డుఫ్లేక్ కింగ్‌సైజ్ ఫిల్టర్ సిగరెట్ తీసి నోట్లో ఉంచుకున్నాడు వెలిగించుకోబోతుంటే చెప్పింది మెటిల్డా.

"వద్దు"

"ఏం?" అడిగాడు.

"నాకు సిగారెట్ పొగ పడదు"

నోట్లోంచి దాన్ని తీసేసాడు

"సిగరెట్ మానెయ్" చెప్పింది.

"నీ మొదటి కోరిక అందులో మొదటిరాత్రి కోరింది తీర్చకుండా వుండలేను" సిగరెట్ పాకెట్ కిటికీ లోంచి వీధిలోకి గిరాటేసాడు.

ఆనందంగా వారం గడిచింది ఆనందంగా రెండు వారాలు గడచాయి. ఆనందంగా నాలుగో వారం నడుస్తోంది.

ఇక ఉండలేక సిగరెట్ వెలిగించాడు రాత్రి

"వద్దు డార్లింగ్" చెప్పింది మెటిల్డా.

"ఈ ఒక్కటే"

అగ్గిపుల్ల గీసి సిగరెట్ వెలిగించాడు నగేష్.

"డార్లింగ్ నువు లేకుండా నే బ్రతకలేను. మా నాన్న అన్నారు నేను నీకు బానిసయ్యానని అది నిజమే అనిపిస్తోంది" చెప్పాడు నగేష్ ప్రేమగా మెటిల్డా చేతినిరాస్తూ.

మెటిల్డా మెత్తగా నవ్వి చెప్పింది.

"నగేష్. నిజం కాదు"

"కాదా?"

"కాదు. తల్లిదండ్రులని ఎదిరించి, కులాన్ని మతాన్ని కాదని నన్ను చేసుకున్నప్పుడున్న ధైర్యం సిగరెట్ మానేయడంలో లేదనకు. నువు నాక్కాదు సిగరెట్‌కి బానిసవని" చెప్పింది చిన్నగా నిట్టూర్చి.

# సెవెన్టీ ఎం. ఎం. దోసె

"సెవెన్‌టీ ఎమ్. ఎమ్. దోసె" చెప్పింది అహ్లూవాలియా భార్య సరిత రెస్టారెంట్‌లోని బేరర్‌కి.

"నాక్కూడా అదే" అహ్లూవాలియా చెప్పాడు.

"పొడుగ్గా, కాగితంలా సన్నగా భలే వుంటుంది నాకెంతో ఇష్టం" భర్త మొహంలోని భావాలని పసిగట్టి చెప్పింది సరిత.

వారిద్దరికి వివాహం అయి నాలుగురోజు లైంది. హనీమూనుకి వూటీకి వచ్చారు. మూడు రోజులు అక్కడ గడిపి తర్వాత గోవా వెళ్తున్నారు.

అహ్లూవాలియా నార్త్ ఇండియన్ గడ్డం, మీసం నాలుగు సంవత్సరాల నించీ వుంది. వారిద్దరిదీ ప్రేమ వివాహం.

ఆరాత్రే వారి మొదటి రాత్రి.

రేస్‌కోర్స్ వెనకవున్న వుడ్‌లాండ్స్ హోటల్లో ఆ నూతన దంపతుల తొలిరాత్రి గడిచింది.

మర్నాడు వుదయం అహ్లూవాలియా బాత్‌రూంలోకి వెళ్తూంటే సరిత చెప్పింది.

"డార్లింగ్ నాదో చిన్న కోరిక"

"ఏమిటి?" అడిగాడు.

"గడ్డం తీసేయరాదూ? గుచ్చుకుంటుంటే ఎంతో ఇబ్బందిగా వుంది"